నాడు భరోసా.. నేడు నిరాశ



గత ప్రభుత్వంలో భీమవరం పట్టణంలో నిర్మించిన అర్బన్ పీహెచ్‌సీ భవనం



ఉత్తరపాలెంలో జగనన్న సురక్ష క్యాంపులో వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం (ఫైల్)



భీమవరం జగనన్న సురక్ష క్యాంపులో వైద్య సేవలు పొందుతున్న ప్రజలు (ఫైల్)

- జగన్ పాలనలో పేదల ఆర్యోగానికి పెద్దపీట
- కూటమి ప్రభుత్వంలో అస్సలు పట్టించుకోని వైనం

భీమవరం(ప్రకాశం చౌక్): పేదల ఆరోగ్యామే మహా భాగ్యం అన్నట్లుగా గత ప్రభుత్వ పాలన నడిస్తే పేదల ఆరోగ్యానికి నీళ్లు వదలివేసే తీరుగా నేడు కూటమి ప్రభుత్వ పాలన నడుస్తుంది. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో పేద, మధ్య తరగతి వర్గాల ఆరోగ్యానికి అండగా నిలబడ్డారు. పేదల ఇంటి తలుపు తట్టి వైద్య సేవలు అందించేలా పనిచేశారు. ప్రస్తుతం పేదవాడు ఆస్పత్రికి వెళ్తేబిల్లులు రావడం లేదని ఆరోగ్యశ్రీ నిలిపేశామని వైద్యులు చెప్పే పరిస్థితి వచ్చింది. 108 దగ్గర నుంచి 104, 102 వరకు వైద్య సేవలు పారదర్శంగా అందించిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికి దక్కింది. పీహెచ్‌సీలు భవనాల నిర్మాణం, ఆస్పత్రుల భవనాల నిర్మాణం పూర్తి స్థాయి వైద్యులు, సిబ్బంది, సౌకర్యాలతో పేదవాడికి కార్పోరేటివ్ స్థాయి వైద్యం ఉచితంగా అందించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గంలో మాదిరిగానే భీమవరం నియోజకవర్గంలో నాటి జగన్ పాలనలో 1.50 లక్షల కుంటుబాలకు ఆరోగ్యానికి భరోసా ఉండేది. నియోజకవర్గంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉచిత వైద్యం, ఆసరా, సురక్ష క్యాంపులతో స్థానిక వైద్యం చక్కగా అందేది. నేడు భీమవరం నియోజకవర్గంలో ఆపరిస్థితి లేదు.

ఏడాది పాలనలో నిరాశ

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కాలంలో పేదల ఆరోగ్యానికి మేలు చేసే ఒక్క పథకం గాని ఒక్క కార్యక్రమం గాని ఈ కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు. గత ప్రభుత్వంలో పేదలకు మేలు చేసే సురక్ష క్యాంపులు ఎత్తివేశారు. ఫ్యామిలి డాక్టర్ విధానంలో వైద్య సేవలు కుదించేశారు. స్థానిక వైద్య సేవలు సక్రమంగా అందడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు కొరత, వైద్యుల కొరత, సౌకర్యాలు కల్పన లేదు.

ఆరోగ్యశ్రీ నిర్వీర్యానికి ప్రయత్నం

పేదల పాలిట సంజీవిని ఆరోగ్య శ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నంలో భాగంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ప్రవేట్ ఆస్పత్రులకు బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో ఆస్పత్రులు వైద్య సేవలు నిలిపివేస్తున్నాయి. భీమవరంలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు 10 వరకు ఉన్నాయి. ఇటీవల బిల్లులు చెల్లింపు లేక ఆరోగ్యశ్రీ సేవలు నిలుపుదల చేశాయి. దాంతో నియోజకవర్గ ప్రజలు వైద్య సేవలు అందక ఇబ్బందులు పడ్డారు.. ఆరోగ్యశ్రీలో కొన్ని వ్యాధులకు మాత్రమే వైద్యం అందించడం, స్థానికంగా వైద్య సేవలు అందించే సౌకర్యాలు లేకపోవడంతో విజయవాడ, గుంటూరు, రాజమండ్రి కాకినాడ వెళ్లే పరిస్థితి ఉంది. గత జగన్ ప్రభుత్వంలో భీమవరం నియోజకవర్గంలో 11.45 లక్షల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు అందించగా రూ 8.82 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. స్థానికంగా అన్ని రకాల వ్యాధులకు ఉచిత వైద్యం అందేది.

ఆరోగ్యశ్రీ ఆసరా నిలిపివేసిన వైనం

ఆరోగ్య శ్రీలో చికిత్స పొందిన వారు విశ్రాంతి సమయంలో ఏపని చేయడానికి వీలు లేక ఉపాధికి ఇబ్బంది పడతారని, అలాగే వారికి మందులు, ఆహారం కోసం గత ప్రభుత్వం ఆసరా పేరట రోజుకు రూ.220 రూపాయలు చొప్పున నెలకు గరిష్ఠంగా రూ.5 వేలు అందించేవారు. భీమవరం నియోజకవర్గంలో గత ప్రభుత్వ 5 ఏళ్ల పాలనలో ఆరోగ్యశ్రీ ఆసరా ద్వారా 6,860 మందిగాను రూ.1.89 కోట్లు ఖర్చు చేసింది. ఈకూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆసరా పథకాన్ని నిలుపుదల చేసింది. దాంతో ఆరోగ్య శ్రీలో చికిత్స పొందిన పేదలు విశ్రాంతి సమయంలో ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

458 సురక్ష క్యాంపులు నిర్వహణ

గత ప్రభుత్వంలో భీమవరం నియోజవర్గంలో 458 వైద్య సురక్ష క్యాంపులు నిర్వహించారు. ఈక్యాంపుల్లో స్థానికంగా మల్టీసెప్షల్టీ వైద్య సేవలు అందించారు. మరింత మెరుగైన వైద్యం అవసరమైన వారికి ఆరోగ్యశ్రీకు సిపార్సు చేసేవారు. కూటమి ఏడాది పాలనలో కనీసం ఒక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసిన దాఖాల లేదు. గత ప్రభుత్వంలో నియోజకవర్గంలో నిర్వహించిన 458 సురక్ష క్యాంపుల్లో 36,4266 మందికి వైద్య సేవలు అందించారు. వారిలో 34,0652 మందికి మందులు, 52182 మందికి కంటి వెలుగు వైద్యం,1733 మందికి ఆరోగ్యశ్రీకి సిపార్సు చేశారు. ఈ క్యాంపుల ద్వారా గర్భశయ, నోటి, రొమ్ము క్యాన్సర్ కేసులు గుర్తించి వైద్య సేవలు అందించారు.

కొత్త వాహనాలతో కళకళ

గత ప్రభుత్వంలో భీమవరం నియోజవర్గానికి సంబంధించి 108 2 వాహనాలు, 104 వాహనాలు 17 కొత్తవి వచ్చాయి. అలాగే 102 తల్లిబిడ్డ వాహనం 1 ఇచ్చారు. వాటి ద్వారా 5 ఏళ్లలో నియోజకవర్గంలో 5 లక్షల మందికి వైద్య సేవలు అందించారు. గత చంద్రబాబు పాలనలో 108,104 వాహనాలు మరమ్మతుల రావడంతో నెలల తరబడి భీమవరం ఎంపీడీవో కార్యాలయం సమీపాన మూలనపడి ఉండేవి. కనీసం మరమ్మత్తులు కూడా చేసేవారు కాదు. ఈ ఏడాది కూటమి పాలనలో అయితే ఒక 108, 104 వాహనాలు కొత్తవి ఒకటి కూడా రాలేదు. 5 ఏళ్ల పాటు వాహనాలు తిరగడం వల్ల మరమ్మతులు వస్తున్నాయి. అయితే వాటి స్థానంలో కొత్త వాహనాలను అందించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణానికి ప్రాధాన్యం

గత ప్రభుత్వంలో భీమవరం పట్టణంలో రూ 80 లక్షల చొప్పున రూ 2.40 కోట్లుతో మూడు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలు నిర్మించారు. అన్ని రకాల వైద్య పరికిరాలు, సౌకర్యాలతో పట్టణ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ ప్రభుత్వం ఏడాది పాలనలో నియోజకవర్గంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అభివృద్ధి పైసా ఖర్చు చేసింది లేదు. అలాగే నియోజకవర్గంలో వీరవాసరం మండలం, భీమవరం మండలంలోని 44 గ్రామ పంచాయితీల్లో స్థానికంగా వైద్య సేవలు అందించడానికి రూ.24 లక్షల చొప్పున రూ.10.56 కోట్లతో విలేజ్ క్లినిక్ భవనాలు నిర్మించారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులో భాగంగా శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మానవతా సంస్థ కోశాధికారి గ్రంధి కుమార వెంకటేశ్వర వరప్రసాద్ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన తరగతులు విద్యార్థులకు ఎంతో ఉపకరిస్తాయన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్స్, టీవీలకు వీలైనంత దూరంగా ఉంచడానికి విజ్ఞాన తరగతులు దోహదం చేస్తాయన్నారు. గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 40 రోజులపాటు నిర్వహించే విజ్ఞాన తరగతుల్లో వివిధ పోటీల్లో విజేతలకు జూన్ 6న బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



భీమవరంలో విద్యార్థినికి సైకిల్ అందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: పేదలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు చేస్తున్న కృషికి తోడుగా స్వచ్ఛంద సంస్థలు, దాతలు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శనివారం శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దాతల సహకారంతో 22 మందికి విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ. 3 వేలు చొప్పున స్కాలర్ షిప్స్, విద్యార్థినికి సైకిల్ ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో భీమవరం వన్ టౌన్ సీఐ ఎం.నాగరాజు, కోళ్ల నాగేశ్వరరావు, భీమాల శ్రీరామ్మూర్తి, వబిలిశెట్టి రామకృష్ణ, పులఖండం కోటేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో 'రెండు' వృత్తి శిక్షణ కోర్సులు



మాట్లాడుతున్న కళాశాల సీపీడీసీ కార్యదర్శి డాక్టర్ పీబీ ప్రతాప్‌కుమార్

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలో సీ ఫుడ్ ప్రాసెసింగ్, సెల్ ఫోన్ మరమ్మతుల శిక్షణకు సంబంధించిన రెండు కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్లు కళాశాల సీపీడీసీ కార్యదర్శి డాక్టర్ పీబీ ప్రతాప్‌కుమార్ చెప్పారు. ఆయన కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా కళాశాలలో నైపుణ్యాభివృద్ధి హబ్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ప్రభుత్వ శిక్షణా ధృవపత్రం అందజేస్తామన్నారు. హబ్ కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ 30 మంది చొప్పున శిక్షణకు ఎంపిక చేస్తామన్నారు. ప్రాసెసింగ్ యూనిట్‌కు 25 సంవత్సరముల లోపు, సెల్‌ఫోన్ రిపేరింగ్‌కు 45 సంవత్సరముల లోపు వారు శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. మూడు నెలల శిక్షణా కాలంలో అనుభవం ఉన్న వ్యక్తులతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఇచ్చే సర్టిఫికెట్ అన్ని విధాలుగా ఉపయోగపడుతుందని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కళాశాలలో సంప్రదించి దరఖాస్తులు అందజేయాలన్నారు.

పోష్ చట్టంపై అవగాహన



పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి లక్ష్మీనారాయణ

భీమవరం: పని చేస్తున్న ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు చేస్తే పోష్ చట్టం ప్రకారం శిక్ష తప్పదని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం స్థానిక 3వ అదనపు జిల్లా కోర్టులో ప్యానల్ న్యాయవాదులకు, పారా లీగల్ వలంటీర్లకు పోష్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళల పరిరక్షణకు ఎన్నో చట్టాలున్నా నిత్యం ఎక్కడో ఒకచోట మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)ఎం.సుధారాణి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్‌బాబు, ఒకటో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) హనీషా, 2వ అదనపు జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పటిష్టానికి కృషి



సునిల్ కుమార్ వర్మ

ఆకివీడు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో యువజన కమిటీలను పటిష్టపరిచేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మంతెన సునీల్‌కుమార్ వర్మ తెలిపారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామానికి చెందిన సునీల్ కుమార్ పార్టీలో అంకితభావంతో పని చేయడంతో తాజాగా రాష్ట్ర స్థాయి పదవి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం ఆయన స్పందిస్తూ పై వ్యాఖ్యలు చేశారు. పార్టీ వైపు యువత మరింత ఆకర్షితులయ్యేవిధంగా తన వంతు ప్రయత్నాలు చేస్తానని చెప్పారు. తన నియామకానికి కృషి చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగులకు పదవీవిరమణ సత్కారాలు



పదవీవిరమణ చేసిన పోలీసులను సత్కరిస్తున్న ఏఎస్పీ భీమారావు



ఏఓ శ్రీకర్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ కఠారి జయలక్ష్మి

భీమవరం: సుదీర్ఘ కాలంపాటు అంకిత భావంతో పోలీసుశాఖలో ప్రజలకు నిస్వార్థ సేవలందించిన పదవీవిరమణ చేసిన పోలీసుల సేవలు అభినందనీయమని జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు అన్నారు. శనివారం పదవీవిరమణ చేసిన భీమవరం ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ, డీఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న హోమ్ గార్డ్ బుల్లయ్యలను భీమారావు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుటుంబ జీవితాన్ని సైతం త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మర్డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (అడ్మిన్) డి.సురేష్, ఆర్ఎస్సై గోపి, పోలిసు అసోసియేషన్ ప్రెసిడెంట్ సిహెచ్ మోజెష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఓ శ్రీకర్‌కు పదవీ విరమణ సత్కారం

ఆకివీడు: మండల పరిషత్ సూపరింటిండెంట్(ఏఓ)గా పనిచేసిన ఎస్. స్వరాజ్ శ్రీకర్ సేవలు మరువలేమని ఎంపీపీ కఠారి జయలక్ష్మి, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను) అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం పదవి విరమణ చేసిన సందర్భంగా జరిగిన సభలో ఆయను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకర్ కొవిడ్ సమయంలోనూ, ఇతర సందర్భాల్లో చేసిన సేవలనుమండల ప్రజలు మరువలేరన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, ఏఓ ప్రియాంక, వైఎస్సార్ సీపీ నాయకులు కేశిరెడ్డి మురళీ, కఠారి కేశవరావు, షడ్రక్, కురెళ్ల పోలు, వెస్ ఎంపీపీ సైదాల సూర్యనారాయణ, విప్ కిల్లి రామకృష్ణ, సర్పంచ్‌లు నందమూరి ప్రకాశం, ఎన్.రామరాజు, ముద్దే విశ్వేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రెయిన్ పనులకు భూమి పూజ

కాళ్ల: మండలంలోని బొండాడలో రూ.5 లక్షలతో నిర్మించబోయే అండర్‌గ్రౌండ్ డ్రెయిన్ నిర్మాణ పనులకు శనివారం డీసీ చైర్మన్ తోట ఫణిబాబు భూమి పూజల చేశారు. గ్రామంలో వాడకం నీరు నేరుగా పంటకాలవలో కలవడంతో శివారు గ్రామాల ప్రజలు ఇబ్బందులు వస్తున్నాయన్నారు. అందువల్ల నేరుగా మురుగు కాలువలో కలిసే విధంగా పైపులు, తూములతో సుమారు 300 మీటర్ల మేర డ్రెయినేజీ నిర్మిస్తున్నామని సర్పంచ్ మన్నే వరలక్ష్మి నాగరాజు తెలిపారు. ఈ పనులు నాణ్యతతో నిర్వహించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు మందపాటి కృష్ణమూర్తి, మన్నే సోమేశ్వరరావు, గంగుల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు



స్థానిక నగర పంచాయతీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: నగర పంచాయతీ పరిధిలో మంచినీటి సమస్యకు సత్వర చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ జామి హైమావతి ఆదేశించారు. సమావేశ హాలులో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన హైమావతి మాట్లాడుతూ సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చినప్పుడు వాటి పరిష్కారాన్ని కూడా వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. నగర పంచాయతీ కార్యాయలంలో సిబ్బంది కొరతను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. ఆదాయ మార్గాలు చూడకుండా నిర్లిప్తంగా వ్యవహరించడం తగదన్నారు. నాన్‌లేఅవుట్ లలో ఇళ్ల నిర్మాణం వల్ల నగర పంచాయతీకి లక్షలాది రూపాయల ఆదాయం పోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఖాళీ స్థలాలు, పన్ను వసూళ్లకు డిమాండ్ నోటీసులు తక్షణం ఇవ్వాలని కోరారు. కౌన్సిలర్ నిమ్మల నాగు మాట్లాడుతూ మాదివాడలోని పలు రోడ్లకు ఉన్న పేర్లను మార్చివేశారని, ఎన్ని సమావేశాల్లో ప్రస్తావించినా చర్యలు తీసుకోవడంలేదని కమిషనర్‌పై మండిపడ్డారు. సిబ్బంది కొరత వల్ల జాప్యం జరుగుతుందని కమిషనర్ కృష్ణ మోహన్ తెలిపారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తెన్నపల్లిలో వీఆర్ఏల రాష్ట్ర మహాసభలు



భీమవరంలో సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడుతున్న సుబ్బారావు

భీమవరం: గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర 4వ మహాసభలు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జూన్ 6న జరుగుతాయని గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా నాయకుడు పిల్లి సుబ్బారావు, రావూరి మాణిక్యాలరావు తెలిపారు. శనివారం భీమవరంలో సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఏర్పాటు చేయడానికి, గ్రామ సేవకులను ఐక్యం చేయడానికి సీఐటీయూ నాయకుడు నర్రా రాఘవరెడ్డి నాయకత్వంలో కృషి జరిగిందని, సంఘం ఏర్పాటు తర్వాత మండల స్థాయి నుంచి పోరాటాలు చేసి అనేక ఫలితాలు సాధించామన్నారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించే రాష్ట్ర మహాసభలకు అన్ని మండలాల నుంచి నాయకులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎం.అంజనేయులు, నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

మానవత సంస్థ నూతన కార్యవర్గం ఎన్నిక



భీమవరంలో మానవత సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని మానవత సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం స్థానిక ఆర్య వైశ్య వర్తక సంఘ భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మానవతా సంస్థ జిల్లా విస్తరణ కమిటీ కన్వీనర్ సాగిరాజు జానకి రామరాజు మాట్లాడుతూ గత రెండేళ్లుగా వెయ్యి మంది సభ్యులతో సంస్థను విస్తరింపజేసి వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిగా చింతలపాటి రామకృష్ణంరాజు, కార్యదర్శిగా వడ్డీ వెంకటేశ్వరరావు, కోశాధికారిగా గ్రంధి కుమార వెంకటేశ్వర వరప్రసాద్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ సాగిరాజు సత్యనారాయణరాజు, సంయుక్త కార్యదర్శిగా ఉద్దరాజు ఇందిర, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా మానుకొండ సుధీర్ బాబు, యు ప్రకాశరావు, కలిగొట్ల గోపాల శర్మ, అల్లు శ్రీనివాస్,గౌరవ డైరెక్టర్‌గా పెనుమెత్స రామ్మోహన వర్మ, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌గా పళ్ళ శేషలీల, వీవీ నరసయ్య, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్‌గా చాన్ బాష తదితరులతో ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజు, కో చైర్మన్ కార్మూరి నర్సింహమూర్తిబాబు, కన్వీనర్ వబిలిశెట్టి వెంకటేశ్వర రావు, ఇందుకూరి ప్రసాదరాజు పాల్గొన్నారు.

పొగాకు వల్ల ఊపిరితిత్తుల సమస్యలు



కాళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో నిర్వహించారు. డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ గీతాభాయి మాట్లాడుతూ పొగ తాగడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలు వస్తాయన్నారు. సిగరెట్లు, చుట్ట, పాన్ మసాలా తదితర పొగాకు వీటికి దూరంగా ఉండాలన్నారు. తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం ఆసుపత్రిల్లో కౌన్సిలింగ్ ఇచ్చి నికోటిన్ గమ్స్ ఉచితంగా అందచేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలకోడేరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సీహెచ్‌వీ రంగం నాయుడు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు సేవించడం వల్ల చాలా అనారోగ్యాలు సంభవిస్తాయని ముఖ్యంగా ప్రాణాంతకరమైన క్యాన్సర్‌కి పుగాకు మూల కారణమన్నారు. అంతేకాకుండా పొగాకు సేవించడం వలన ఊపిరితిత్తులకు సంబంధించిన దీర్ఘకాలిక వ్యాధులు సంభవిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి స్వర్ణ నిరంజని, సీహెచ్‌ఓ సత్యనారాయణ, పీహెచ్‌హెన్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: ప్రజలు నికోటిన్ ఉత్పత్తులు తీసుకోవడం ద్వారా ఊపిరితిత్తులు పాడై క్యాన్సర్ బారినపడే అవకాశం ఉందని కాళ్ల మండల వైద్యాధికారి డాక్టర్ సునీల్ తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కాళ్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగ తాగే వారి కన్నా పక్క నుంచి పీల్చే వారికి ఎక్కువ ప్రమాదం సోకే అవకాశం ఉన్నందున పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్లు డి.సునీత, టి.భావన, సీహెచ్ఓ విజయవతి పాల్గొన్నారు.

వ్యవసాయంలో సాంకేతికతను జోడించాలి



ఉండి: పాందువ్వలో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి



భీమవరం అర్బన్: తుందుర్రులో మాట్లాడుతున్న ఉండి కేవీకే మత్స్యశాఖ శాస్త్ర వేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసరావు

ఉండి: వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తే అధిక దిగుబడులు,అధిక ఆదాయాన్ని రైతులు ఆర్జించ వచ్చునని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు.శనివారం ఉండి మండలం పాందువ్వ నిర్వహించిన కేంద్రప్రభుత్వ కార్యక్రమం వికసిత్ కృషీ సంకల్ప అభియాన్ అనే కార్యక్రమానికి జేసీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై రైతులకు పూర్తిస్థాయిలో అధికారులు అవగాహన కల్పించాలన్నారు. సాగులో అదనపు,అనవసరపు ఖర్చులు తగ్గడంతో పాటు లాభాలు వస్తాయని సూచించారు. రైతులు మట్టి నమూనాలను తప్పనిసరిగా పరీక్షించుకోవాలని, ఎరువుల వాడకంపైనా వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను పాటించాలన్నారు. అలాగే సార్వా పంటకు మేలైన రకాలను ఎంపిక చేసుకుని సాగు చేయాలని అన్నారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులంతా సార్వాలో నూతన, మేలైన వంగడాలను సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని అన్నారు. ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు కొందరికి ధాన్యం నగదు బ్యాంకు ఖాతాల్లో పడాల్సి ఉందని మరికొద్ది రోజుల్లో జమఅవుతుందని రైతులను సముదాయించే మాటలు చెప్పారు. కేవీకే ముఖ్యశాస్త్రవేత్త డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు, సహదేవుడు, డాక్టర్ వినయలక్ష్మి, సర్పంచ్ యామిని ప్రియాంక, ఏఓ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులు సాగులో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

భీమవరం అర్బన్: రైతులు సాగులో వినూత్నంగా ఆలోచించి సాంకేతికతను అందిపుచ్చుకున్నప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉండి కేవీకే మత్స్యశాఖ శాస్త్రవేత్త డాక్టర్ కె.శ్రీనివాసరావు అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు, తాడేరు, బేతపూడి గ్రామాలలో శనివారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెదవేగి ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ ఎంవీ ప్రసాద్, మార్టేరు ఎటోమాలజీ శాస్త్రవేత్త డాక్టర్ ఆనంద్, ప్లాంట్ బ్రీడింగ్ శాస్త్రవేత్త డాక్టర్ రమణ, ఏఈఓ బి. దేవి స్వరూప తదితరులు పాల్గొన్నారు.